క్లుప్తంగా

రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు

బెజ్జూర్: ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే రాయితీ బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్ అన్నారు. పక్కా సమాచారం మేరకు మంగళవారం మండల కేంద్రంలోని గొల్లవాడ ప్రాంతంలో తనిఖీ చేశారు. గొల్లవాడకు చెందిన ఎండీ సల్మాన్‌ఖాన్ అనే వ్యక్తి ఆటోలో సుమారు 5 క్వింటాళ్ల రాయితీ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బియ్యం స్వాధీనం చేసుకొని నిందితుడిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తిర్యాణి: నాయీ బ్రాహ్మణ సంఘం మండల కమిటీని మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా నాయకుడు కళ్యాణపు తిరుపతి తెలిపారు. మండల అధ్యక్షుడిగా కళ్యాణపు అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా కళ్యాణపు దామోదర్, గౌరవ అధ్యక్షులుగా శంకర్, లచ్చయ్య, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పవన్, ప్రచార కార్యదర్శిగా మనోహర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులను పరీక్ష కేంద్రానికి చేర్చిన ఏఎస్సై

తిర్యాణి: మండల కేంద్రం నుంచి చెలిమల గ్రామంలోని పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు వాహనం లేక ఆందోళన చెందుతున్న ఇంటర్ విద్యార్థులను ఏఎస్సై నారాయణ సకాలంలో పరీక్ష కేంద్రానికి చేర్చి మానవత్వం చాటుకున్నారు. ఎగ్జామ్ సెంటర్‌లో ఐదు నిమిషాల నిబంధన కొనసాగుతుండటంతో విద్యార్థులను సమయానికి పరీక్ష కేంద్రానికి చేర్చిన నారాయణను జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

పేకాటస్థావరంపై దాడి

బెజ్జూర్: మండలంలోని కృష్ణపెల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పేకాట ఆడుతున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో సీఐ రమేశ్ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు పేర్కొన్నారు. 14 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.2150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఇంద్రవెల్లి: పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

ఉట్నూర్‌రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 66 మందికి లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. పేదలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వెడ్మ ఫౌండేషన్‌కు యూత్ కాంగ్రెస్ నాయకులు సల్లుభాయ్ రూ.50 వేల విరాళాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. సోషల్ మీడియా కోఆర్డినేటర్ మోమీన్ పాల్గొన్నారు.

'వ్యవసాయానికి రూ.లక్ష కోట్లు కేటాయించాలి'

ఇచ్చోడ: రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.లక్ష కోట్లు కేటాయించాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెం బొర్రన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతేడాది కన్నా ఈ సంవత్సరం వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. పూర్తిస్థాయిలో పంట రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో నకిలీ విత్తనాలు సరఫరా కాకుండా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

నార్నూర్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని మహారాష్ట్రలోని పొరాదేవి పీఠాధిపతి శేఖర్ మహారాజ్ అన్నారు. మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీలో కళాకారుడు అడే వసంత్ ఇంట్లో మంగళవారం నిర్వహించిన పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆయన్ను సన్మానించారు.

ఉపాధి పనులు పకడ్బందీగా చేపట్టాలి

బోథ్: మండలంలోని నక్కలవాడ పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పనులను ఎంపీడీవో రమేశ్ మంగళవారం పరిశీలించారు. ఉపాధి హామీ పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. పనుల్లో కొలతలే ప్రామాణికంగా తీసుకుంటామన్నారు.

కూరగాయల కన్నెపల్లి



కన్నెపల్లి గ్రామానికి చెందిన ఆదే నాగయ్య తన ఎకరన్నర భూమిలో వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్నాడు. నీటి కోసం పొక్లెయిన్‌తో బావి తవ్వించాడు. తన పొలంలో మిర్చి, టమాటా, వంకాయ, గోబి, కొత్తిమీర, మెంతి, తోటకూర సాగు చేస్తున్నాడు. ఇంటిలోని కుటుంబ సభ్యులందరూ కలిసి కూరగాయలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. ప్రతీ వారం రూ.4వేల వరకు ఆదాయం వస్తున్నట్లు ఆయన తెలిపాడు.



కౌటాల వారసంతలో కూరగాయలు విక్రయిస్తున్న కన్నెపల్లి రైతులు

- అన్ని రకాల పంటలు సాగు
- వార సంతల్లో విక్రయం
- ఆదర్శంగా నిలుస్తున్న రైతులు

కౌటాల: మూస పద్ధతుల్లో సంప్రదాయ పంటలు పండించే రైతులు ఎక్కువ ఖర్చు పెట్టి తక్కువ లాభాలు పొందుతారు. కానీ కొందరు రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇచ్చే కూరగాయలు, ఆకుకూరలు పండిస్తుంటారు. ఊరిలో సగానికి పైగా రైతులు కూరగాయలు సాగు చేస్తూ రైతులందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు మండలంలోని కన్నెపల్లి గ్రామ రైతులు.

ఊరంతా సాగు..

మార్కెట్ సౌకర్యం, గిట్టుబాటు ధర లేకపోవడంతో చాలా మంది రైతులు కూరగాయల సాగుపై ఆసక్తి చూపడం లేదు. కానీ కన్నెపల్లి గ్రామంలో ఒకరిద్దరు కాదు.. ఊరు ఊరంతా వరి, పత్తి తదితర పంటలతో పాటు కూరగాయలు పండిస్తున్నారు. గ్రామంలో 250 కుటుంబాలు ఉండగా వారిలో 150 కుటుంబాల రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారు. ఇక్కడ ఏ కాలమైన తాజా కూరగాయలు లభిస్తాయి. ప్రతీ రైతు అర ఎకరం మొదలుకుని రెండెకరాల విస్తీర్ణంలో కూరగాయలు సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు. కొందరు రైతులు పొక్లెయిన్‌తో బావులు తవ్వుకొని నీటి నిల్వ చేసుకొని ఆయిల్ ఇంజన్, విద్యుత్ మోటార్ల సహాయంతో సాగుకు నీరు అందిస్తున్నారు. కొందరు బోర్లు వేసుకొని పంటలను సాగు చేస్తున్నారు. నీటి బొట్టును వృథా పోకుండా పైపుల ద్వారా సాగుకు నీటిని అందిస్తున్నారు.

సంతల్లో విక్రయించి..

రైతుకు ప్రతీరోజు ఆదాయాన్ని అందించే పంట కూరగాయలు. ప్రణాళికబద్ధంగా వివిధ రకాల కూరగాయలు విత్తుకుంటూ ఏడాది పొడవునా, అన్ని సీజన్లలోనూ అనేక రకాల కూరగాయలు చేతికి వచ్చేలా రైతులు సాగు చేస్తున్నారు. రైతు కుటుంబం తినడంతో పాటు వాటిని గ్రామంలో, వార సంతల్లో విక్రయిస్తున్నారు. రైతులు మిర్చి, తోటకూర, పాలకూర, కొత్తిమీర, మెంతికూర, బెండకాయ, చిక్కుడుకాయ, కాకరకాయ, వంకాయ, టమాటా, వలిచెంత, గోబి, పసుపు పంటలను సాగు చేస్తున్నారు. ఇక్కడ పండిన వాటిని ఆటోల్లో తీసుకెళ్లి కౌటాల, బెజ్జూర్, రవీంద్రనగర్, బాబాసాగర్, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), సులుగుపల్లి వార సంతల్లో విక్రయిస్తుంటారు. కూరగాయలు విక్రయించేందుకు మార్కెట్ సౌకర్యం కల్పించడంతో పాటు కూరగాయలు విక్రయించడానికి రాయితీపై వాహనాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

వారసంతల్లో విక్రయం



కుటుంబ సభ్యులందరం కలిసి కూరగాయలు సాగు చేస్తాం. కూరగాయలను ఉదయాన్నే తెంచి ఆటల్లో వారసంతలకు తరలించి మేమే విక్రయిస్తాం. కూరగాయల సాగుతో కష్టానికి తగ్గట్టుగా లాభాలు వస్తున్నాయి. ఉద్యానవన శాఖ అధికారులు కూరగాయల సాగులో సలహాలు, సూచనలు అందించాలి. **- మొర్లె లక్ష్మీబాయి, కన్నెపల్లి**

సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలి



మా గ్రామంలోని చాలా మంది రైతులు వారి పెరటి తోటలతో పాటు వ్యవసాయ భూముల్లో అన్ని రకాల కూరగాయలు సాగు చేస్తారు. దీంతో మాకు తక్కువ ధరకు ప్రతీరోజు తాజా కూరగాయలు దొరుకుతాయి. చాలా మంది రైతులు వ్యవసాయ బావి, బోర్ల సాయంతో సాగు చేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించాలి. **- పాండురంగ్, కన్నెపల్లి**

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత



పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు

లింగాపూర్: మండలంలోని కంచన్‌పల్లి ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు పరీక్షప్యాడ్‌లు, పెన్నులు, పరీక్ష సామగ్రి అందజేశారు. ఎస్సై గంగన్న మాట్లాడుతూ పరీక్ష సమయంలో ధైర్యంగా ఉండాలన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



ఉద్యోగిని సన్మానిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని బాల రక్షభవన్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో గత మూడు సంవత్సరాలుగా అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న సావిత్రిని జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్, కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించి, స్వీట్లు తినిపించారు. సిబ్బంది శ్రావణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, నసీర్, ఉస్మాన్, శ్రీనివాస్, నవీన్, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల రక్షణకు 'గ్రీన్‌నెట్'

- నర్సరీల్లో ఏర్పాటు
- ఎండ తీవ్రత తట్టుకునేందుకు చర్యలు
- మండలంలోని 14 నర్సరీల్లో మొక్కల పెంపకం



గ్రీన్‌నెట్‌లో పెంచుతున్న మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీవో రాంచందర్, ఏపీవో చంద్రయ్య

లింగాపూర్: పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి.. ఎండలు మండుతున్నాయి.. ఈ నేపథ్యంలో నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఎండల నుంచి రక్షణకు నర్సరీల్లో గ్రీన్ నెట్లు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లో పచ్చదనం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవం కార్యక్రమం చేపడుతోంది. ఇందులో భాగంగా ప్రతీ పంచాయతీలో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపట్టారు. మండలంలో జూన్ వరకు 1,69,400 మొక్కలను సిద్ధంగా ఉంచాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతీ నర్సరీలో పది వేలకు తగ్గకుండా మొక్కలు పెంచి వర్షాకాలం నాటికి నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. ఎండాకాలం నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది మొక్కలు ఎండిపోకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో వనసేవకుడితో నీటిని పోయిస్తూ సంరక్షిస్తున్నారు. మొక్కల చుట్టూ ప్రత్యేకంగా కట్టె స్థంభాలు ఏర్పాటు చేసి వాటిపై నుంచి పందిళ్లు వేశారు.

14 పంచాయతీల్లోని నర్సరీలు..

లింగాపూర్ మండలంలోని 14 గ్రామపంచాయతీల్లోని నర్సరీల్లో 1,69,400 మొక్కలు పెంచేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు ప్రతీ గ్రామపంచాయతీలోని నర్సరీలో 12వేల నుంచి 14వేల మొక్కలు పెంచుతున్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లకు ఇరువైపులా వివిధ రకాల మొక్కలు నాటేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కూలీలకు ఉపాధి..

ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలో ఏర్పాటు చేసిన గ్రామీణ నర్సరీల్లో కూలీలు ఉపాధి పొందుతున్నారు. వన సేవకులు నర్సరీల్లోని మొక్కలకు నీరు పోస్తూ ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చేందుకు ఉపాధి కూలీలు ఎండలో సైతం పని చేస్తున్నారు. నర్సరీల నిర్వహణకు ప్రభుత్వం ప్రతీ గ్రామంలో రైతులను ఎంపిక చేసింది. ప్రతీ రైతుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాన్ని అందిస్తోంది.

వివిధ రకాలు..

ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీల్లో జామ, ఉసిరి, అల్లనేరేడు, చింత, మామిడి, సీతాఫలం, దానిమ్మ, కర్జూర, బాదాం వంటి పండ్ల మొక్కలతో పాటు గులాబీ, మల్లె, మందారం వంటి పూల మొక్కలు పెంచుతున్నారు. గతంతో పోల్చితే ప్రజలు ఇష్టపడే వివిధ రకాల మొక్కలను అందుబాటులో ఉండేలా అధికారులు చూస్తున్నారు.

అవసరమైన రకాలు పెంచుతున్నాం



ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో నర్సరీల్లో చలువ పందిళ్లు వేశాం. ఎండకు మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. వర్షాకాలం వచ్చే సరికి మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచుతాం.

- చంద్రయ్య, ఏపీవో

సిద్ధం చేస్తున్నాం..



మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి. నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు పెంచుతున్నాం. నర్సరీలను నిత్యం పర్యవేక్షిస్తూ నిర్వహకులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. లక్ష్యం మేరకు మొక్కలు సిద్ధం చేస్తున్నాం.

- రాంచందర్, ఎంపీడీవో

ఉపాధ్యాయులను నియమించాలని వేడుకోలు



ఎంఈవోతో మాట్లాడుతున్న కోటా గ్రామస్తులు

కెరమెరి: మండలంలోని పరంధోళి గ్రామ పంచాయతీకి చెందిన కోటా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బోధనకు ఇద్దరు ఉపాధ్యాయులు కావాలని ఆ గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ ఎదుట మొరపెట్టుకున్నారు. మంగళవారం ఆయన పాఠశాలను సందర్శించారు. అక్కడ 1 నుంచి 5వ తరగతి వరకు 42 మంది విద్యార్థులు ఉన్నారు. అక్కడ విధులు నిర్వహించే ఉపాధ్యాయుడు ఇటీవల బదిలీపై ఇతర మండలానికి వెళ్లారు. దీంతో ఆ పాఠశాలకు డిప్యూటేషన్‌పై ఒక మహిళా టీచర్‌ను నియమించారు. కానీ ఐదు తరగతులకు ఒక్క టీచరే ఉండడంతో ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లినప్పుడు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క ఉపాధ్యాయుడు అన్ని తరగతులకు బోధించాలంటే ఇబ్బందిగా ఉంటుందని తక్షణమే మరో ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్తులు కోరగా.. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి మరో టీచర్‌ను నియమిస్తామని ఎంఈవో హామీ ఇచ్చారు. సాయినాథ్, సుధామ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

నేడు సత్యసాయి ఆలయ పదో వార్షికోత్సవం

ఆసిఫాబాద్‌అర్బన్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ఆలయ పదో వార్షికోత్సవాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని గుండి రహదారి వద్ద సత్యసాయి సేవా సదన్ ఆవరణలో నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం 5 గంటలకు ఓంకారం, సాయి సుప్రభాతం, నగర సంకీర్తన, 6.30 గంటలకు ప్రశాంతి పతాకావిష్కరణ, 7 గంటల నుంచి 8 గంటల వరకు హారతి కర్పూర హోమం, మధ్యాహ్నం 1గంట నుంచి 3 గంటల వరకు నారాయణ సేవ (అన్నప్రసాదము), రాత్రి 7 గంటల నుంచి సామూహిక భజన, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వార్షికోత్సవ కార్యక్రమంలో సత్యసాయి భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న అధికారులు

కౌటాల: బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కౌటాల టీజీబీ మేనేజర్ రమేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నగదు రహిత లావాదేవీలు జరపాలన్నారు. డిజిటల్ పేమెంట్స్ విషయంలో ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరాలకు గురైతే పోలీసులను సంప్రదించాలన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ముక్తేశ్వర్, సిబ్బంది రాయుడు, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై ప్రశాంత్

వాంకిడి: యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా దూరంగా ఉండి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎస్సై ప్రశాంత్ సూచించారు. మంగళవారం మండలంలోని సవాతి, ధాబా గ్రామాల్లో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు వేసవి సెలవుల్లో ఎలాంటి పనులు లేకుండా ఖాళీగా ఉండటంతో చెడు వ్యసనాలు అలవడుతుంటారన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం కలుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామ యువకులకు వాలీబాల్ కిట్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులు పూర్తి చేయండి

తలమడుగు: మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులు త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ రాజ్‌మోహన్ అన్నారు. మంగళవారం నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. మండలంలో నూతనంగా ప్రారంభించనున్న ఇళ్ల నిర్మాణ పనులకు ప్రభుత్వ ఆదేశాలతో ఇసుక అందిస్తామన్నారు.

బోరు ప్రారంభం

బోథ్: మండల కేంద్రంలోని 14వ వార్డులో నీటి సమస్యల ఉండటంతో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి బోరు వేయించారు. మంగళవారం బోరును ప్రారంభించారు. నాయకులు పసుల చంటి, నాయకులు ఉన్నారు.

ఇప్పపువ్వుకు పూజలు

బోథ్: సొనాల మండలంలోని పార్డి(కె) గ్రామంలో ఆదివాసీలు మంగళవారం ఇప్పపువ్వుకు పూజలు నిర్వహించారు. ఇప్ప పువ్వు సేకరణ ప్రారంభించడానికి ముందు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. పటేల్ అమృత్ రావు, దేవారి జైతు, మేసరం భూమన్న, అనిల్ తదితరులు ఉన్నారు.

నేడు డిజిటల్ పేమెంట్స్‌పై సదస్సు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని కుమురం భీం ప్రాంగణం పీఎంఆర్సీ సమావేశ మందిరంలో డిజిటల్ పేమెంట్స్‌పై బుధవారం అవగాహన సదస్సు ఉంటుందని టీజీబీ మేనేజర్ సాకేత్ తెలిపారు. ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు హాజరుకావాలని కోరారు.

ఆలయ వార్షికోత్సవం

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలో 42 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మాజీ జెడ్పీటీసీ రాజు, గ్రామస్తులతో కలిసి పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రెబ్బెన: జిల్లాలోని మెడికల్ కళాశాలకు తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టడంతో పాటు అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో రాష్ట్రంలో 55 యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను రూ.11వేల కోట్లతో ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినందుకు మంగళవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో పాల్గొని రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను ప్రజల్లోకి తీసుకెళ్లిన కొండా లక్ష్మణ్‌బాపూజీ సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, మాజీ సర్పంచులు గంటుమేర, రవీందర్, పట్టణ అధ్యక్షుడు మురళీ, నాయకులు రవీందర్, చిరంజీవిగౌడ్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అంజిరెడ్డికి సన్మానం



అంజిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన ఎమ్మెల్సీ అంజిరెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో బీజేపీ సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. జిల్లాలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. అనంతరం జుబ్లీహిల్స్‌లోని హనుమాన్ ఆలయంలో 108 టెంకాయలు కొట్టి తమ మొక్కు తీర్చుకున్నట్లు తెలిపారు.